సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 19 । జనవరి । 2025



జెడ్పీ సమావేశంలో ప్రొటోకాల్ రగడ 8లో



కైలాసగిరి.. సందడే సందడి 8లో



ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి 8లో

న్యూస్‌రీల్

ఏయూలో హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి



న్యాయమూర్తిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య సీతా మాణిక్యం


విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి శనివారం ఉదయం సందర్శించారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం కళాశాల ఆచార్యులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి అయిన జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని ఈ సందర్భంగా న్యాయ కళాశాల తరఫున ప్రిన్సిపాల్ సత్కరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు చంద్రకళ, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీగా ప్రభాకర్ బాధ్యతలు



అల్లిపురం: ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ అధికారిగా కింజరాపు ప్రభాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంవీపీ కాలనీలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అవినీతి నియంత్రణ చర్యలపై రాజీ పడకుండా ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా ప్రజలకు చేరేలా చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏ కార్యదర్శిగా మురళీకృష్ణ



మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ కార్యదర్శిగా పి.మురళీకృష్ణ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మురళీకృష్ణ పార్వతీపురం తోటపల్లి బ్యారేజ్ యూనిట్-3 డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ సంయుక్త కమిషనర్ రమేష్ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

20, 21 తేదీల్లో జాబ్‌మేళాలు



సీతంపేట: ఈ నెల 20వ తేదీన కంచరపాలెం ఎంప్లాయిమెంట్ కార్యాలయం, 21వ తేదీన పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 20న జరిగే జాబ్ మేళాలో బీ డేటా టెక్నాలజీస్, ఇండస్ బ్యాంక్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు, పే టీఎం కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8555868681 నంబర్‌లో సంప్రదించాలన్నారు. 21న పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో టాప్ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (యూస్ బెస్ట్ కంపెనీ), కెల్ గ్రూప్, టీమ్‌లీజ్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమా, బీటెక్ విద్యార్హత గల విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7702506614 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి ఇంటర్న్‌షిప్

సీతంపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వచ్చే ఐదేళ్లలో సుమారు కోటి మందికి పైగా యువతకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు స్టైఫండ్ చెల్లిస్తుందన్నారు. కంపెనీలో చేరేముందు ఇచ్చే రూ.6 వేలు వన్‌టైం గ్రాంట్ కూడా యువతకు ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంటుందని, ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఆసక్తి గల వారు పీఎంఇంటర్న్‌షిప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9494202677, 9848438254 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కూటమిలో క్రెడిట్ ఫీట్లు!

- పవన్ వల్లే ప్యాకేజీ అంటున్న జనసేన
- బాబు వల్లేనని టీడీపీ సంబరాలు
- కూర్మన్నపాలెం కూడలిలో బీజేపీ కార్యక్రమాలు
- ఎవరికివారుగా కార్యక్రమాలు, ప్రకటనలు
- ప్రైవేటీకరణ ప్రతిపాదన రద్దు చేయాలంటూ కార్మికుల డిమాండ్



కూర్మన్నపాలెం కూడలిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్



కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ఉద్యమనేత అమృతరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న గాజువాక జనసేన ఇన్‌చార్జ్ కోన తాతారావు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల ప్రకటన లేకుండా.. సెయిల్‌లో విలీన ప్రతిపాదన గురించి కనీసం మాట్లాడకుండా.. ప్యాకేజీ ప్రకటనపై మాత్రం కూటమి పార్టీలు క్రెడిట్‌ను కొట్టేసేందుకు ఫీట్లు చేస్తున్నాయి. ప్రధానంగా జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వల్లే స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ వచ్చిందంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇక చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే ఈ ప్యాకేజీ వచ్చిందంటూ టీడీపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. బాబు గొప్పతనమంటూ ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్, మాజీ ఎమ్మెల్సీ



మాధవ్‌లు మోదీ 3.0 ప్రభావమంటూ ప్రకటనలు చేశారు. మొత్తంగా ఎవరికివారుగా కార్యక్రమాలు, ప్రకటనలు చేసుకుంటూ తమ గొప్పదనమంటూ చెప్పుకుంటున్నారు. మరోవైపు అసలు ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోకుండా కేవలం ప్యాకేజీ ఇవ్వడమే తమ గొప్పంటూ మాట్లాడటాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్టుగా ప్రకటించడంతో పాటు సెయిల్‌లో విలీనాన్ని ప్రకటించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి.

ఎవరికి వారే.. యమునా తీరే.!

స్టీల్‌ప్లాంట్ ప్యాకేజీ ప్రకటనలో జనసేన నేతలు పూర్తిస్థాయిలో పవన్ కల్యాణ్ పాత్రనే కీలకమని చెబుతున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రెస్‌మీట్ నిర్వహించి మరీ పదే పదే ప్రధాని నరేంద్ర మోదీని పవన్ కల్యాణ్ కలిసి విజ్ఞప్తులు చేయడం వల్లే ప్యాకేజీ వచ్చిందంటూ ప్రకటించారు. తద్వారా ప్రధానపాత్ర పవన్‌దేనని చెప్పుకునే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. మరోవైపు ప్యాకేజీ ప్రకటన చేసిన వెంటనే టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఆ పార్టీ ఎంపీ, ఇతర నేతలు ప్రెస్‌మీట్లు నిర్వహించి చంద్రబాబు గొప్పతనమని చెబుతూ... పార్టీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చారు. ప్యాకేజీ ప్రకటనకు తామే చాంపియన్ అనే చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఇక బీజేపీ నేతలు ఇది మోదీ 3.0 ప్రకటన అని అంటున్నారు. గతంలో ఏదైనా విషయంపై అన్ని పార్టీల నేతలు టీడీపీ కార్యాలయంలో ఉమ్మడిగా కలిసి మాట్లాడేవారు. ఇందుకు భిన్నంగా ఇప్పుడు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కార్మికులు మాత్రం ప్రైవేటీకరణను నిలిపివేశామన్న ప్రకటన లేకుండా.. సెయిల్‌లో విలీనాన్ని ప్రకటించకుండా ఈ సంబరాలు ఎందుకంటూ మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు, స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు తమ తదుపరి కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్‌ను తెరమరుగు చేసి... ప్యాకేజీకే పరిమితమయ్యేలా చేసిన ఈ కూటమి నేతల వ్యవహారాన్ని గుర్తుచేసుకొని ప్రైవేటీకరణ ప్రక్రియ నిలిపివేసే వరకూ విశ్రమించకూడదని నిర్ణయించాయి.

ప్రత్యేక హోదా తరహాలోనే.!

వాస్తవానికి రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ ప్రకటనలు చేశారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక హోదా వస్తే ఏం వస్తుందని? ప్యాకేజీ వస్తే నిధులు వచ్చి అభివృద్ధి జరుగుతుందంటూ నాలిక మడతపెట్టేశారు. ఆ తర్వాత బీజేపీకి వ్యతిరేకంగా నిరసన దీక్షలు చేపట్టినా.. చివరకు అదే పార్టీ పంచన చేరారు. తాజా ఎన్నికల్లో టీడీపీ మద్దతుతోనే కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి అధికారంలో కొనసాగుతున్నప్పటికీ ప్రత్యేక హోదా గురించి మాత్రం మాట్లాడటం లేదు. ప్రత్యేక హోదా తరహాలో స్టీల్ ప్లాంట్‌పై కూడా కుట్ర జరుగుతోందనే అభిప్రాయాలను కార్మిక సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. మొన్నటివరకు కార్మికులకు వేతనాలు సకాలంలో రాకపోయినా పట్టించుకోని కూటమి నేతలు.. స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన వచ్చిన వెంటనే తమదే క్రెడిట్ అంటూ ప్రకటనలు చేస్తున్నాయి. అదేవిధంగా ప్రైవేటీకరణ ప్రకటన వెనక్కి తీసుకోవాలని, సెయిల్‌లో విలీనం చేయాలంటూ గత నాలుగేళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాటాన్ని తప్పుదోవ పట్టించే ధోరణిలో.. ప్యాకేజీ ప్రకటన బ్రహ్మాండం అనే రీతిలో కూటమి పార్టీలు ప్రకటిస్తుండటాన్ని కార్మిక సంఘాలు తప్పుపడుతున్నాయి. ప్రైవేటీకరణ ఆగకుండా కేవలం ప్యాకేజీతో నడిపిద్దామనుకునే ధోరణిలో ఈ పార్టీలు వ్యవహరిస్తున్నాయని మండిపడుతున్నాయి.



వైఎస్సార్ సీపీ సమన్వయకర్తల నియామకం

- భీమిలి నియోజకవర్గానికి చిన్న శ్రీను
- గాజువాక నియోజకవర్గానికి దేవన్‌రెడ్డి





తాటిచెట్లపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించారు. అలాగే అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా కరణం ధర్మశ్రీ, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా గుడివాడ అమర్‌నాథ్, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడిని నియమించారు.

శరీర దారుఢ్య పరీక్షలకు 336 మంది హాజరు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. శరీర దారుఢ్య పరీక్షలకు శనివారం 336 మంది అభ్యర్థులు హాజరవగా 264 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. హాజరైనవారికి వారికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించామన్నారు.

స్వచ్ఛతలో విశాఖను అగ్రభాగాన నిలపాలి

- మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- ఘనంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమం



మొక్కలు నాటుతున్న మేయర్, కలెక్టర్



మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

ఎంవీపీకాలనీ: స్వచ్ఛతలో విశాఖను అగ్రభాగాన నిలపాలని, ఈ క్రతువులో నగర ప్రజలంతా భాగస్వాములుగా నిలవాలని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆమె కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, గేదెల లావణ్యలతో కలిసి ప్రారంభించారు. శివాజీ పార్కులోని యోగ సాధన సెంటర్ వేదికగా శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నగర కాలుష్యాన్ని తగ్గించే దిశగా జీవీఎంసీ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు పెంపకం, కాలుష్య నియంత్రణ, వర్షపు నీరు నిల్వ చెయ్యడంపై నగర ప్రజలు దృష్టిసారించాలని కోరారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఇండోర్ నగరం మాదిరిగా పారిశుద్ధ్యంలో విశాఖను నంబర్ వన్‌గా నిలపడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ప్రతి నెల 3వ శనివారం నగరంలోని అన్ని వార్డుల్లో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. శుభ్రతలో ప్రతి నెల నంబర్ 1గా నిలిచిన వార్డ్‌కు రూ.5 లక్షలు అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని, దీంతో పాటు ఆ వార్డ్‌లోని నలుగురు శానిటరీ కార్యదర్శులకు రూ.5 వేలు చొప్పున బహుమతి అందజేస్తామని చెప్పారు. అనంతరం శివాజీ పార్కులో మేయర్, కలెక్టర్, కమిషనర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్ రాజు, డీడీహెచ్ఎం దామోదరరావు, యూసీడీ పీడీ సత్యవేణి, జోన్-3 కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో ముందడుగు

- కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్
- సౌత్ జోన్-2 సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న కర్నాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అను శివరామన్

విశాఖ లీగల్: శరవేగంతో విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం న్యాయవ్యవస్థలో కూడా అభివృద్ధి చెందాలని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ అన్నారు. శనివారం మధ్యాహ్నం బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వకళా పరిషత్ కన్వెన్షన్ సెంటర్లో జాతీయ, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన సౌత్ జోన్-2 సదస్సులో న్యాయస్థానాల్లో వాజ్యాల జాబితా అన్వేషణ, మినహాయింపు అన్న అంశంపై న్యాయ నిపుణులు ప్రసంగించారు. ఏడు రాష్ట్రాలకు చెందిన హైకోర్టు, జిల్లా కోర్టు, ఇతర కోర్టుల న్యాయమూర్తులు సదస్సుకు హాజరయ్యారు. సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి 25 మందికి పైగా న్యాయకోవిదులు పాల్గొన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక తీరు తెన్నులు- భవిష్యత్తులో మార్పులపై కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ ప్రసంగించారు. డిజిటల్ సాంకేతికత న్యాయవ్యవస్థతో అనుసంధానం కావాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రతి రంగంలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేపథ్యంలో న్యాయస్థానాల్లో కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత చూపించాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా -సాధారణ మీడియా మధ్య సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఇటీవల కాలంలో ఈ మీడియాల వల్ల వస్తున్న సమస్యలను విశదీకరించారు. డిజిటల్ సంతకాలు నైపుణ్యం కలిగిన న్యాయవాదులు, న్యాయమూర్తులు రేపటి భవితకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. 2015 నాటికి సాంకేతికపరమైన విషయాలకు సంబంధించి ఓ పుస్తకంలో అంశాలను ఆమె వివరించారు.

న్యాయ స్థానాల్లో జవాబుదారీతనం కీలకం



మాట్లాడుతున్న జస్టిస్ సీఎం జోషి

న్యాయస్థానాల్లో జవాబుదారీతనం చాలా కీలకమైందని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, ఈ కోర్టుల పర్యవేక్షకులు జస్టిస్ సీఎం జోషి పేర్కొన్నారు. సాంకేతికత పేరుతో ముందుకెళుతున్న న్యాయస్థానాలు అంతర్గత మార్పులకు ముందడుగు వేయాలన్నారు. చలానా, ఫైన్ కేసులు సైతం విపరీతమైన జాప్యానికి ఎవరు కారణమనేది ప్రశ్నించుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ప్రత్యామ్నాయ పరిష్కార వివాద యంత్రాంగ సేవలను పొందాలని కూడా సూచించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఇటీవల కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరిగిన ఈ కోర్టుల విధానాన్ని వివరించారు. వర్చువల్ విధానంలో కేసులు విచారణకు కేరళ హైకోర్టు తీసుకున్న చర్యలను జస్టిస్ సీఎం జోషి వెల్లడించారు. 30 మంది హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ జూనియర్ సివిల్ జడ్జిలు, మేజిస్ట్రేట్లు, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరినాథశర్మ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ తీరం

- ఘనంగా త్రివిధ దళాల విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం
- జాతీయ జెండాలతో భారీ ర్యాలీ
- భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు



ర్యాలీ ప్రారంభిస్తున్న తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ -కమాండింగ్ ఇన్ చీఫ్ రాజేష్ పెంథార్కర్



జాతీయ జెండాలు చేతబూని..

ఏయూక్యాంపస్: దేశ రక్షణ దళాల 9వ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని శనివారం బీచ్‌రోడ్డులో ఘనంగా నిర్వహించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి, కోస్టల్ బ్యాటరీ కూడలి వరకు త్రివర్ణ పతాకాలతో నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. భారత్ మాతాకీ జై అంటూ విశ్రాంత ఉద్యోగుల నినాదాలతో సాగర తీరం పులకించింది. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షణ దళాల విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని తూర్పు నావికాదళం ఫ్లాగ్ ఆఫీసర్-కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంథార్కర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నేవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వైస్ అడ్మిరల్ రిటైర్డ్ వీకే నంబల్ల, వెటరన్ సెయిల్స్ ఫోరం గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు మాస్టర్ చీఫ్ పెట్టీ ఆఫీసర్ (రిటైర్డ్) డాక్టర్ పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. తూర్పు నావికాదళం బ్యాండ్ తమ సంగీతంతో ముందుకు సాగగా, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, సైనిక్ స్కూల్ విద్యార్థులు, సీ క్యాడెట్ కార్ప్స్ కవాతుతో ముందు నడిచారు. వీరిని అనుసరిస్తూ విశ్రాంత సైనికోద్యోగులు, నావికాదళ సిబ్బంది, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. నిస్వార్థ సేవలు అందించి, పదవీ విరమణ చేసిన వారిని వైస్ అడ్మిరల్ రాజేష్ పెంథార్కర్ అభినందించారు. తమ సిబ్బంది సంక్షేమం, భద్రత కోసం నేవీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం నేవీలో సేవలందిస్తున్న సిబ్బందిని, విశ్రాంత సిబ్బందితో అనుసంధానం చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని తూర్పు నావికాదళం నిర్వహించింది.



నేవీ బ్యాండ్.







• హావభావాల హాస్య'బ్రహ్మ'

నవ్వించడానికి చాలామంది ఉన్నారు. అందరిదీ తలో స్టైల్. ఒకరు మాటలతో,మరొకరు ఎక్స్‌ప్రెషన్స్‌తో, మరొకరు మరోలా.. కానీ ఈ అన్నిటినీ కలిపి నవ్వించడం బ్రహ్మానందం స్టైల్. అందుకే ఇన్నేళ్లైనా అతని ఎక్స్‌ప్రెషన్స్‌కు ఎక్స్‌పైరీ డేట్ రాలేదు. అతని డైలాగ్స్ పై మొనాటనీ రాలేదు. కేవలం నవ్వించడమే కాదు నవరసాలను పండించడంలో దిట్ట మన బ్రహ్మీ. విశాఖలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన హావభావాలు నవ్వులు పూయించాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట: విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నడుపుతున్న ఆస్పత్రులు, క్లినిక్లు, డెంటల్ క్లినిక్స్, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్టర్/రెన్యువల్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. లేకుంటే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్-2002 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆస్పత్రులు, క్లినిక్స్ ,ల్యాబ్‌లు https@//clinicalesttact.ap.gov.in, స్కానింగ్ కేంద్రాలు https@//pepndt.ap.gov. inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. అర్హత, అనుమతి లేని వారు వైద్యులుగా చలామణి అవుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తప్పుడు వైద్యం చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని డీఎంహెచ్‌వో అన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్

మహారాణిపేట: 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం కచ్చితంగా పాల్గొనాలన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, ఏవో ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

దాబాగార్డెన్స్: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, దురదృష్టమేమిటంటే అక్షరాస్యులు ఓటింగ్‌కు దూరంగా ఉండడం ఆందోళన కలిగిస్తుందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలోని ఓ హోటల్‌లో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమాజంలో కట్టుబాట్లు ఉన్న లిఖిత పూర్వకంగా ఉండాలనే రాజ్యాంగాన్ని రాసుకున్నామని, జీవన వ్యవస్థలో కట్టుబాట్లు లేకుండా ఎవరూ లేరన్నారు. పద్ధతులు, నియమాలు ఉండాలనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని రాసుకున్నామన్నారు. భారతదేశం ఉత్తమమైన ప్రజాస్వామిక దేశమన్నారు. ప్రజాస్వామ్యానిన పటిష్టం చేసింది రాజ్యాంగమేనన్నారు. కార్యక్రమంలో పీవీఎన్ మాధవ్, పృథ్విరాజ్, ఎం.నాగేంద్ర, కాశీవిశ్వనాథ్, ఎస్‌వీఎస్ ప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

- అధికారుల తీరుపై అరకు ఎమ్మెల్యే ఆగ్రహం
- 2025–26 అంచనా బడ్జెట్ ఆమోదం
- చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జెడ్పీ సమావేశం

మహారాణిపేట: ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు తమకు ప్రాధాన్యత లేకపోవడంతోపాటు ఎలాంటి ఆహ్వానాలు అందడం లేదని పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ మీద వాడిగావేడీగా చర్చ జరిగింది. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రొటోకాల్ విషయం తొలుత ప్రస్తావించారు. ఇటీవల అనంతగిరి మండలంలో రోడ్డు పనులకు శంకుస్థాపన జరిగిందని, ఎమ్మెల్యేగా తనకు ఆహ్వానం లేదని, అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ప్రశ్నించారు. కొంతమంది అధికారులు టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు కప్పుకొని తిరుగుతున్నారని, వారి అజెండాలను మోస్తూ ప్రజల చేత ఎన్నుకున్న తమలాంటి ఎమ్మెల్యేలను అవమానానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలను కాదని కూటమి నాయకులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ఎంత వరకు సమంజమని ఆయన ప్రశ్నించారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ రోడ్డు పనుల శంకుస్థాపనకు స్థానికంగా ఉన్న తమకు ఎలాంటి ఆహ్వానం లేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం మారగానే కొంతమంది అధికారులు తీరులో మార్పు కనబడుతోందన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎవరు అధికారంలో ఉన్న నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉందన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంకితభావంతో పనిచేయాలి

సమస్యలపై అధికారులు అంకితభావంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. స్థాయీ సంఘ సమావేశాలతో పాటు జెడ్పీ సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పనులు, ఆర్థిక ప్రణాళికలు,తదితర అంశాలపై చర్చించారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి భవనాలు, అతిథి గృహాలు, షాప్‌లు, స్థలాలు ఏవిధంగా అభివృద్ధి చేయాలనే విషయమై సభ్యుల సలహాలను కోరారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్లే ప్రయత్నిస్తామని సుభద్ర వెల్లడించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 19 జెడ్పీ అతిథి గృహాలు ఉన్నాయని, కొన్నిటికి మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. నిర్వహణకు ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.1589 కోట్ల 13లక్షల 81వేల 635, అంచనా వ్యయం రూ.1586 కోట్ల 8లక్షల 58వేల 235 సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీడీ విజయకుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

సంబరాలు ఎందుకో?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో స్టీల్‌ప్లాంట్‌కి రూ.15 వేలు కోట్లు
- కూటమి ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,440 కోట్లా?
- డిమాండ్ల సాధనకు నేడు గాజువాకలో మహాధర్నా
- సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో గల విశ్వేశ్వరరాయ స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్ల ప్యాకేజీ... కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న మన రాష్ట్రంలో గల విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,440 కోట్లు ప్రకటిస్తే సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు ఎద్దేవా చేశారు. గుడ్డిలో మెల్ల అన్నట్టుగా ఇచ్చిన ప్యాకేజీని స్వాగతిస్తున్నామని, అయితే గత నాలుగేళ్లుగా కార్మికులు, విశాఖ ప్రజలు, కార్మిక సంఘాలు చేసిన పోరాట విజయమేనన్నారు. శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఏ మాత్రం సత్తా ఉన్నా.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని, స్టీల్‌ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటన చేయించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్‌పై ఉన్న ప్రేమ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపుపై ప్రధాని మోదీ వద్ద ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. గతంలో కూడా ఇలాగే ప్యాకేజీ ప్రకటించి జీఎస్టీ తదితర రూపంలో లాగేసుకున్నారని చెప్పారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ కొనసాగించాలని, నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈ నెల 19న గాజువాకలో పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సీపీఎం నాయకుడు, స్టీల్‌ప్లాంట్ కార్మి క సంఘం నాయకుడు కె.శ్రీనివాసరావు, సీపీఎం కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, కె.పద్మ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలపై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కోర్సులు నగరంలోని ద్వారకాబస్టేషన్ సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 ఏళ్ల నుంచి 28 ఏళ్లలోపు గల విద్యార్థులు అర్హులని తెలిపారు. మూడు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణతో పాటు యూనిఫారం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9381667986, 7207953919 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్యాస్ ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. సుమారు 24 రోజుల పాటు మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచింది. గత ఏడాది డిసెంబరు 25న ఇందిరానగర్‌లో ఇంట్లో గ్యాస్ లీకైన ఘటనలో మంటలు రేగి ఏడుగురు గాయపడిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన టి.సత్యవతి (28), ఆమె కుమారులు రాజశేఖర్, చంద్రశేఖర్‌లను మెరుగైన వైద్యం కోసం విమ్స్ నుంచి వెంకోజీపాలెం వద్ద మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స అక్కడ పొందుతున్న వారిలో సత్యవతి మృతి చెందినట్లు ఆరిలోవ సీఐ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు. ఆమె పిల్లల ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో తల్లిని కోల్పోయిన ఆ ఇద్దరు పిల్లలు కొంతకాలంగా తండ్రికి కూడా దూరంగా ఉండటంతో అనాథలుగా మిగిలారంటూ స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

కైలాసగిరి..సందడే సందడి



కుటుంబ సమేతంగా ..



సర్క్యూట్ ట్రైన్ స్టేషన్‌లో సందర్శకుల సందడి



ఎయిర్ సైక్లింగ్ చేస్తున్న యువత



వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు

ఆరిలోవ: పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు కావడం..దీనికి వీకెండ్ తోడవడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరి శనివారం పర్యాటకులతో కళకళలాడింది. ఘాట్ రోడ్డు చెక్‌పోస్టు నుంచి కైలాసగిరి కొండపై ఆర్చ్ వరకు వాహనాలు బారులు తీరాయి. మరో పక్క రోప్‌వే, నడక మార్గం ద్వారా అధిక సంఖ్యలో సందర్శకులు కొండపైకి చేరుకొన్నారు. దీంతో కైలాసగిరిపై ఎక్కడ చూసిన సందర్శకుల సందడి నెలకొంది. సందర్శకులు శివపార్వతులు విగ్రహం వద్ద, వ్యూపాయింట్, ఐ లవ్ కైలాసగిరి పాయింట్, సర్క్యూట్ ట్రైన్ స్టేషన్ వద్ద గుంపులుగా ఫొటోలు తీసుకొన్నారు. యువత ఉత్సాహంగా ఎయిర్ సైక్లింగ్ చేస్తూ సందడి చేశారు. వృద్ధులు, పిల్లలు ఇక్కడ బ్యాటరీ వాహనాలపై తిరిగి అందాలను తిలకించారు. పిల్లలు ఆడుకొంటూ సరదాగా గడిపారు.

భూముల విలువ పెంపుపై అభ్యంతరాలు తెలియజేయండి

తాటిచెట్లపాలెం: భూముల విలువలు పెంపు ప్రతిపాదనలు–2024లో ప్రజలకు అభ్యంతరాలుంటే తెలియజేయాలని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బాలకృష్ణ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వారి మార్కెట్ వేల్యూ రివిజన్ ప్రపోజల్స్–2024లో భాగంగా విశాఖ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ప్రొవిజనల్ మార్కెట్ వేల్యూస్ 2025 జనవరి 17న ఆమోదించామన్నారు. శనివారం నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో..అదే విధంగా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో తమ అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల వరకు తెలియజేయవచ్చన్నారు. అలాగే ప్రజలు/ కక్షిదారులు తమ అభ్యంతరాలను సబ్ రిజిస్ట్రార్ / తహసీల్దార్ / మునిసిపల్ జోనల్ కార్యాలయాలలో జనవరి 24వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తెలియజేయాలని సూచించారు.

మెర్మైడ్..మెస్మరైజ్





బీచ్‌రోడ్డులో పోలీస్ మెస్ వెనుక మైదానంలో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్ పో 2025లో మత్స్య కన్యలు (మెర్మైడ్) కనువిందు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన భారీ నీటి తొట్టెల్లో మత్స్య కన్యల నమూనాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నీట్లో ఈత కొడుతూ సందడి చేస్తున్న మత్స్యకన్యల నమూనాలను తిలకించడానికి చిన్నారులు ఆసక్తి చూపారు. ఫొటోలు తీస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ నగర వాసులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విశాఖ నగరంలో తొలిసారిగా మెర్మైడ్‌లు కనువిందు చేస్తున్నాయి. మత్స్యకన్యలను పోలిన విధంగా వస్త్రధారణతో సముద్రంలో ఈదుకుంటూ వస్తున్న అనుభూతిని కలిగిస్తున్నారు. దీంతో సందర్శకులు భలే మజా అనుభవిస్తున్నారు. వీరిని చూసిన చిన్నారులు కేరింతలు కొడుతున్నారు. విశాఖ నగరంలో తొలిసారిగా ప్రత్యేక ఆకర్షణగా వీటిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

–ఏయూక్యాంపస్/ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

చల్లగా చూడు.. గౌరమ్మ తల్లీ..



వేల్పులవీధిలో గౌరీ పరమేశ్వరుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి: వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యా యి. శనివారం ఉదయమే ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. అమ్మవారి మహోత్సవానికి రెండు నెలల ముందుగా పట్టంలో పలు ప్రాంతాల్లో నేలవేషాలు, స్టేజ్ ప్రొగ్రాములు, సంస్కృతిక కార్యక్రమాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉదయం 9 గంటలకు అమ్మవారి రథంపై ఉంచి పట్టణంలో పురవీధులు గుండా సోమవారం తెల్లవారు జాము వరకూ ఊరేగిస్తున్నారు. సాయంత్రం అమ్మవారి నేల వేషాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిసిపోయ్యాయి. ఈ మహోత్సవానికి సుమారుగా 3 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు పర్యవేక్షించారు. అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని వేల్పులవీధిలో, అమ్మవారి ఆలయం వద్ద పలు సంఘాల ప్రతినిధులు పులిహోర, కిచిడి, సత్యనారాయణస్వామి ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్సవానికి వచ్చే భక్తులకు పంపిణీ ప్రసాదాలు చేశారు.



అమ్మవారి ఉత్సవంలో మెయిన్‌రోడ్డులో కిక్కిరిసిన భక్తులు